అభివృద్ధి పథంలో గుడివాడ

- గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- ప్రభుత్వ పాఠశాలలకు నూతన హంగులు
- డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు

గుడివాడరూరల్: గుడివాడ మండలంలోని గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడమే కాకుండా గ్రామాల్లోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరువ చేసి సుపరిపాలన అందిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిషర్ ట్రాన్స్‌ఫర్) నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేయడమే కాకుండా పరోక్షంగా లబ్ధిదారులకు కోట్లాది రూపాయలను అందజేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది.

గ్రామాలకు నూతన కళ



మండలంలోని 12 సచివాలయాల పరిధిలో నూతన సచివాలయ భవనం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, రైతుభరోసా కేంద్రాలు నిర్మించడంతో ఆయా గ్రామాలకు నూతన కళ సంతరించుకుంది. గుడివాడ మార్కెట్‌యార్డ్‌లో డాక్టర్ వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ను రూ.68 లక్షలతో నిర్మించారు. మరో రూ.40లక్షల నుంచి రూ.50 లక్షలతో ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేశారు. మండలంలో ఒక్కో రైతు భరోసా కేంద్రాన్ని రూ.21.80 లక్షలతో నిర్మించారు. మండలానికి తొమ్మిది రైతుభరోసా కేంద్రాలకు గాను ఐదు ఆర్‌బీకేలు నిర్మాణాలు పూర్తి చేసుకుని రైతులకు సేవలందిస్తున్నాయి. వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఆరు మంజూరు కాగా ఒక్కో దాని నిర్మాణానికి రూ.20.8 లక్షలు కేటాయించారు. నాలుగు భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకోగా మరో రెండు నిర్మాణ దశలో ఉన్నాయి. అదేవిధంగా జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.11.59 కోట్లు కేటాయించింది. దాదాపు 90శాతం ఇంటింట కుళాయి నిర్మాణాలు పూర్తయ్యాయి. తొమ్మిది గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలకు రూ.3.60 కోట్లు మంజూరు చేశారు. ఒక్కో సచివాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించారు. అదేవిధంగా మండలంలో సుమారు రూ.4.50 కోట్లతో సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రెయినేజీల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరి కొన్ని పూర్తయ్యాయి.



నాడు-నేడుతో రూపురేఖలు మారిన వలివర్తిపాడు ఎంపీయూపీ పాఠశాల


దొండపాడులో గడప గడప నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు


బిళ్లపాడు రైతుభరోసా కేంద్రం


మల్లాయపాలెం-2 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్



మల్లాయపాలెం సచివాలయం

మండలంలో డీబీటీ ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసిన నగదు

పథకం	లబ్ధిదారులు	నిధులు
వైఎస్సార్ పెన్షన్ కానుక	8,414	రూ.80,26,01,250
జగనన్న అమ్మఒడి	4,691	రూ.19,66,65,136
వైఎస్సార్ చేయూత	3,801	రూ.17,34,93,000
వైఎస్సార్ ఆసరా	9,242	రూ.33,84,23,615
వైఎస్సార్ రైతుభరోసా	6,290	రూ.27,72,34,550
ఇంటి నిర్మాణానికి (నేరుగా చెల్లింపులు)	1,671	రూ.16,71,79,986
సున్నావడ్డీ	8,996	రూ.1,95,78,355
ఉచిత పంటల బీమా	3,004	రూ.2,55,07,281
వైఎస్సార్ కాపునేస్తం	802	రూ.3,33,60,000
జగనన్న విద్యాదీవెన	3,602	రూ.14,05,23,624
జగనన్న వసతిదీవెన	3,123	రూ.4,21,56,553
వైఎస్సార్ నేతన్ననేస్తం	22	రూ.15,36,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	283	రూ.75,75,000
వైఎస్సార్ బీమా	150	రూ.1,91,20,500
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	2,052	రూ.1,42,12,901
వైఎస్సార్ వాహన మిత్ర	441	రూ.1,36,00,000
సున్నావడ్డీ పంట రుణాలు	2,774	రూ.67,45,922
జగనన్న చేదోడు	204	రూ.48,00,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	1,512	రూ.6,45,90,237
తెల్ల రేషన్‌కార్డుదారులకు (కోవిడ్ సాయం)	13,232	రూ.15,99,19,576
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	998	రూ.73,20,025
వైఎస్సార్ మత్స్యకార భరోసా	04	రూ.40,000
అగ్రిగోల్డ్	690	రూ.57,69,681
కల్యాణమస్తు, షాదీతోఫా	42	రూ.33,00,000
అర్చకులు,ఇమాములు,పాస్టర్లకు (సాయం)	40	రూ.2,95,000
జగనన్న తోడు	1,388	రూ.1,48,79,458
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	2,048	రూ.3,83,59,040
జగనన్న గోరుముద్ద	2,987	రూ.2,95,92,209
జగనన్న విద్యాకానుక	2,980	రూ.2,11,63,960
ఇళ్ల స్థలాల భూసేకరణ (పరిహారం చెల్లింపులు)	2,581	రూ.47,04,57,000
మొత్తం:	88,064	రూ.309,99,99,859

క్లుప్తంగా

ఎన్నికల నియమావళి పాటించండి



గుడివాడ టౌన్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా నిబంధనలకు లోబడి కోడ్ అమలు చేయాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నియమావళి ప్రాధాన్యం, పనితీరు, బాధ్యతలు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే జరిగే పరిణామాలు అధికారులకు వివరించారు. నియమావళి అమలు చేయడంలో ఏ ఒక్కరూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా ఉపేక్షించేది లేదన్నారు. గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు తహసీల్దార్లు ఏవీ. రామాంజనేయులు, బి.నాగరాజు నాయక్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సహాయమాత గృహ ప్రతిష్ట



ముదినేపల్లి రూరల్: మండలంలోని చిగురుకోట ఆర్సీఎం చర్చిలో నిత్య సహాయమాత గృహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహాయమాత భక్తులకు, దేవుడికి మధ్య వారధిలా భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి అని కొనియాడారు. ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడిచి ఇతరులకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కోమటి విష్ణువర్ధన్, శేఖర్, ఉదయరేఖ, జ్ఞాన ప్రకాష్, గొల్ల బాబి, కురేళ్ల పేతురు, బాబు రావు, ప్రదీప్, సువర్ణరాజు, కృపారాజు, ఏసురాజు, విచారణకర్త జోజి ప్రతాప్‌కుమార్, ఉపదేశకులు ఏరిచర్ల రఫాయేలు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నూతన తహసీల్దార్‌గా ఎం.సునీల్‌కుమార్ బాధ్యతలను స్వీకరించారు. అవనిగడ్డ నుంచి బదిలీపై వచ్చిన ఆయన విధుల్లో చేరి శుక్రవారం తన బాధ్యతలను స్వీకరించారు. గుడ్లవల్లేరులో పని చేసిన అబ్దుల్ రెహ్మాన్ సుల్తానా గతంలోనే బదిలీపై తూర్పు గోదావరి జిల్లా సీతానగరం వెళ్లారు. విధుల్లో చేరిన శ్రీనివాస్‌ను డీటీ బి.కనకదుర్గ, ఆర్ఐ షకీలా బేగం, వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు.

ఆరోగ్యశ్రీ కొనసాగేలా చర్యలు తీసుకోవాలి

తోట్లవల్లూరు: పేద రోగులకు కొండంత ఆసరాగా నిలుస్తున్న ఆరోగ్యశ్రీ వైద్యసేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని వల్లూరుపాలెంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేస్తామని హాస్పిటల్స్ యాజమాన్యాలు ప్రకటించాయని, వారి తీరుతో పేదలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్ లేకుండా ఉన్నతాధికారులు చూడాలని కోరారు. నాయకులు యేమినేని లెనిన్‌బాబు, సింహాద్రి రాంబాబు, ఒంద్రు నాగేశ్వరరావు, జుజ్జవరపు ఏసోబు పాల్గొన్నారు.

వీధి దీపాలు ప్రారంభం

మండవల్లి: మండవల్లిలో హౌసింగ్ లే అవుట్-2లో సర్పంచ్ మెండా ఝాన్సీ శుక్రవారం విద్యుత్ మీటర్, వీధి దీపాలు శుక్రవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

పోస్టాఫీసు ప్రారంభం

కైకలూరు: కైకలూరు సబ్ డివిజన్ పరిధిలో చటాకాయి గ్రామంలో నూతన బ్రాంచ్ పోస్టాఫీసును గుడివాడ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ అంబేడ్కర్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ బ్రాంచ్ ద్వారా చటాకాయి, నత్తగుళ్లపాడు, సింగాపురం గ్రామస్తులకు పోస్టల్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్, పల్లెవాడ పోస్టుమాస్టర్ దానం ఆనంద్ విజయ్‌కుమార్, కైకలూరు సబ్ పోస్టుమాస్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ లబ్ధి

కలిదిండి: కులం మతం ప్రాంతం రాజకీయం చూడకుండా అర్హతే ప్రాధాన్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పెద్ద కోడలు శ్రీఅనుపమ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుర్వాయిపాలెం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింట ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి, ఏఎంసి చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచ్ ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

కామినేనిని, చంద్రబాబును ప్రజలు నమ్మరు

ఎమ్మెల్యే డీఎన్నార్


గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రాష్ట్రంలో చంద్రబాబును, నియోజకవర్గంలో కామినేని శ్రీనివాస్‌ను నమ్మే పరిస్థితుల్లో ఓటర్లు లేరని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. గుడ్ మార్నింగ్ కైకలూరు పేరుతో సాగుతున్న కార్యక్రమం శుక్రవారానికి 20వ రోజుకు చేరింది. వెలంపేట కాలనీ 19, 20 వార్డులలో ఇంటింటికి పర్యటించి ప్రజల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. వెలంపేటలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు ఫణి శ్యామ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రఫీ, వార్డు సభ్యులు గాలిబ్‌బాబు, సమయం అంజి, నాయకులు సానా శ్రీనివాసరావు, మడక శ్రీనివాసరావు, సుంకర శివరామయ్య, రెడ్డి శ్రీనివాసరావు, గౌరినాయుడు, శ్రీను, ప్రకాష్, నాగేశ్వరరావు, ఏసు, లాజరు, పూర్ణ, పెద్దిరాజు, నాగు, జబీఉల్లా పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టాలి


పెదగొన్నూరుకలో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి

ముదినేపల్లి రూరల్: సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ సారథి జగనన్నకే రాబోయే ఎన్నికల్లో పట్టం కట్టాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని పెదగొన్నూరులో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారాన్ని మూడో రోజైన శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌ను గెలిపించి, జగనన్న ముఖ్యమంత్రిగా మళ్లీ బాధ్యతలు చేపట్టేలా ఆశీర్వదించాలని కోరారు. వైస్ ఎంపీపీలు రాచూరి రాధ, చొప్పర్ల సునీత, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు, ఎంపీటీసీ ఏసుబాబు, సర్పంచ్ తాడంకి శిరీష, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, దివి సతీష్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

విశాఖ డ్రగ్స్ కేసులో నిందితులను తేల్చాలి


మాట్లాడుతున్న నారాయణరెడ్డి

గుడివాడ టౌన్: విశాఖపట్నంలో వెలుగు చూసిన 25 వేల టన్నుల డ్రగ్స్ స్వాధీనానికి సంబంధించిన నిందితులను గుర్తించాలని వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన వ్యక్తిగత కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. ఎరువుల పేరుతో డ్రగ్స్ కుంభకోణానికి సంబంధించి కంపెనీ యజమాని పేరు కోటయ్యచౌదరి అని సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సీడ్ రూపంలో ఈ డ్రగ్స్‌ను ఇంపోర్ట్ చేసుకున్నారని వార్త వచ్చిందన్నారు. ఈ విషయానికి మసి పూసి మారేడుకాయ రాసిన టీడీపీ నాయకులు ఓ చానల్‌లో జగన్‌మోహన్‌రెడ్డి ఈ డ్రగ్స్ దింపించారని, తీసుకువచ్చారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో సైతం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని ట్రక్కులు కడప మీదుగా మద్రాసు వెళ్తుంటే దానికి సెక్యూరిటీ ఏర్పాటు చేసినందుకు జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు నగదు తరలిస్తున్నారని వార్తలు సైతం ప్రచారం చేశారన్నారు. తెలుగుదేశం మీడియా తొలి నుంచి ఈ విధమైన అబద్ధపు ప్రచారాలు చేస్తూనే ఉన్నారు. అయితే ప్రజలు వారి తప్పుడు ఆరోపణలను పట్టించుకోవడంలేదన్నారు. నిజం నిగ్గుతేలాలంటే ఈ విషయంపై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఇందులో దొంగలెవరో తేల్చాలని, పురందేశ్వరి, బాలకృష్ణ, బాలకృష్ణ అల్లుడు, సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ యజమాని కోటయ్య చౌదరి మధ్య సంబంధం, వారి పాత్ర ఏమిటో, కంపెనీ భాగస్వాములు ఎవరు? ఎంతకాలంగా ఈ వ్యవహారం నడుస్తుంది? ఎవరెవరికి ఇందులో ప్రమేయం ఉంది అనే విషయాన్ని నిగ్గు తేల్చాలని ఆయన కోరారు.



అ'పూర్వ' సమ్మేళనం

పమిడిముక్కల: మంటాడలో పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళనం శుక్రవారం జరిగింది. తాడంకి జెడ్పీ ఉన్నత పాఠశాల 1972-73 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని పరిచయం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. చందలూరి ప్రసాద్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో మంటాడ, తాడంకి, గురజాడ, మద్రివాడ, గోపువానిపాలెం, కనుమూరు గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో శ్రీదేవి

పామర్రు: రానున్న ఎన్నికలకు సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా అన్ని నిఘా బృందాలు పగడ్బందీగా విధులు నిర్వహించాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కె.శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎఫ్ఎస్ టీ, ఎంసీసీ, ఎక్స్‌పెండీచర్ అబ్జర్వేషన్ బృందాలకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకోసం ఏర్పాటు చేసిన నిఘా బృందాల పనితీరుపై ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని సూచించారు. ఎన్నికల నిబంధనల మేరకు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లకూడదన్నారు. ఒక వేళ అవసరమై తీసుకెళ్తుంటే సంబంధిత పత్రాలు చూపించాలన్నారు. లేని పక్షంలో ఆ నగదును సీజ్‌చేయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, వివరాల పోస్టర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. సీజ్ చేసిన నగదు రూ.10లక్షలు లోపు ఉంటే జిల్లా ట్రెజరర్ కార్యాలయంలో అందజేయాలని, రూ.10 లక్షలు దాటితే ఇన్‌కమ్ ట్యాక్స్ నోడల్ అధికారికి అందజేయాలని పేర్కొన్నారు. ఎలక్షన్ కోడ్ అనుసరించి ప్రభుత్వ, పబ్లిక్ స్థలాలలో ఏర్పాటుచేసిన అన్ని రకాల ప్రచార హోర్డింగులు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, వాల్‌పేపర్లను తొలగించాలనిస్పష్టం చేశారు. మత పరమైన ప్రార్థనామందిరాల వద్ద, రాజకీయ నాయకులు ఎలాంటి ప్రచారాలు నిర్వహించకుండా చూడాలన్నారు. సమావేశంలో పామర్రు తహసీల్దార్ శ్రీ పల్లవి, నియోజకవర్గంలోని అధికారులు పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత

తోట్లవల్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని రొయ్యూరు సమీపంలో జరిగింది. కృష్ణా కరకట్టపై ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఒక ట్రాక్టర్‌ను రొయ్యూరు-వల్లూరుపాలెం మధ్యలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

శ్మశాన వాటిక రోడ్డు సమస్యకు పరిష్కారం

కొర్నిపాడు(పెదపారుపూడి): సుమారు 40 సంవత్సరాల ఎస్సీల శ్మశాన వాటిక రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొర్నిపాడులో ఎస్సీవాడ శ్మశాన వాటికకు దారిలేకపోవడంతో అవస్థలు పడ్డారు. గడప గడప కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో శ్మశాన వాటికకు వెళ్లేందుకు వర్షంలో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని ఎంపీపీకి సూచించారు. మండల పరిషత్ నిధుల నుంచి సుమారు రూ.3 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎన్నికల కోడ్ ముందే నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ఎంపీపీ గోగం సురేష్ పేర్కొన్నారు. గ్రామస్తులు పిలుపు మెరకు రోడ్డు నిర్మాణ పనులు ఎంపీపీ స్థానిక నేతలతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

రంజాన్ మాస శుభాకాంక్షలు

కలిదిండి: రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తనయుడు దూలం వీర ఆది వినయ్ కుమార్ ఆకాంక్షించారు. కోటకలిదిండిలోని పెద్ద మసీదులో శుక్రవారం జరిగిన ప్రార్థన కార్యక్రమంలో పాల్గొని రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు షఫాయితుల్లా, నీలి సుమన్, వక్ఫ్ బోర్డు సభ్యులు చాన్ బాషా, బీసీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు హఫీజ్, వైఎస్సార్ సీపీ నాయకులు వురా శ్రీధర్, చిట్టూరి రంగారావు, ఆకుల మురళి, మసీముక్కు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నృసింహుడి కల్యాణం

కైకలూరు: వరహాపట్నం భూ సమేత శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి శుక్రవారం ఉదయం విశేష పంచామృతాభిషేకం, పెండ్లి కుమారుడిని చేయడం, గోపూజ, సామూహిక కంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్తలు కామినేని పట్టాభిరామయ్య, కామినేని శ్రీనివాస్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

30న వేలంపాట

కైకలూరు: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో(సెబ్) కైకలూరు పరిధిలో 2023లో చేసిన దాడిలో పట్టుబడిన టీవీఎస్ విక్టర్ మోటారు సైకిల్‌ను ఈ నెల 30న ఉదయం 10 గంటలకు కైకలూరు సెబ్ కార్యాలయంలో వేలం వేయనున్నారు. ఈ మేరకు స్థానిక సెబ్ సీఐ డి.సుధ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పోలీసుల కవాతు

పామర్రు: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పామర్రు పోలీస్‌శాఖ అధికారులు ప్రత్యేక రిజర్వుడు పోలీస్ దళాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలకు అండగా ఉన్నామని తెలియజేసేందుకే ఈ కవాతు నిర్వహించామన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

పెదపారుపూడి: మండలంలోని భూషణగుళ్ల, చినపారుపూడి గ్రామంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు డి. చైతన్యశ్రీనివాస్, సగుర్తి నరేష్ ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో ఎంపీడీఓ టీ. సీతామహాలక్ష్మి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వారిని సన్మానించారు. ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, కార్యాలయ సూపరింటెండెంట్ రమణారావు, పంచాయతీ కార్యదర్శులు సాంబశివరావు, సాగరరాణి పాల్గొన్నారు.

గ్రామపంచాయితీ కార్యాలయము, కైకలూరు

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 33/2024 తేది. 22-03-2024

ఏలూరుజిల్లా, కైకలూరు మండలం, కైకలూరు గ్రామపంచాయితీ ఏరియాలో ప్రజారోగ్య పారిశుధ్యపు పనులు చేయుటకు, రక్షిత మంచినీటి సరఫరా పథకం నిర్వహణ, పైపులైన్లు రిపేర్లు చేయుటకు మరియు వీధి లైట్లు రిపేరు చేసి వేయుటకు ది. 01-04-2024 నుండి ది. 31-03-2025 వరకు అనగా ఒక సంవత్సరమునకు కాంట్రాక్టు లేబరు పద్ధతిన పనిచేయుటకు కైకలూరు గ్రామపంచాయితీ కార్యాలయము వద్ద ది. 27-03-2024వ తేదీ బుధవారం ఉదయం గం॥ 10-30 గం॥ల నుండి మధ్యాహ్నం 2-00 గం॥ల వరకు టెండర్లు స్వీకరించుటకు టెండర్లు కోరడమైనది. సదరు టెండర్లు కైకలూరు గ్రామ పంచాయితీ కార్యదర్శి వారిచే గానీ లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. దాఖలు కాబడిన టెండర్లు అదే రోజున మధ్యాహ్నం 3-00 గంటలకు టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. టెండరుదాఖలు చేయువారు ముందుగా గ్రామపంచాయితీకి టెండరు డిపాజిట్ చెల్లించి రసీదు పొంది సదరు రసీదు టెండరుకు జతచేసి టెండరుదాఖలు చేయవలయును. టెండరు తేదీన ఏదైనా ప్రభుత్వ సెలవు దినము ప్రకటించిన యెడల మరుసటి రోజున అదే సమయమునకు టెండర్లు దాఖలు చేయవలయును. మిగిలిన వివరములు గ్రామపంచాయితీ కార్యాలయము పనిచేయు దినములలో తెలుసుకొనగలరు.

షెడ్యూలు

వ. నెం.	పని వివరము	మనుషుల వివరము	పనివారల సంఖ్య	కాలము	టెండరు ధరావత్తు
1.	ప్రజారోగ్య పారిశుధ్యపు పనుల నిర్వహణ నిమిత్తం డ్రైన్లు క్లీన్ చేయుటకు మరియు ట్రాక్టర్లపై పనిచేయుటకు స్వీపర్లుగా పనిచేయుట	మగవారు	35 మంది	ది. 01/04/2024 నుండి ది. 31/03/2025 వరకు	మనిషి 1కి టెండర్ ధరావత్తు రూ. 200/- చొప్పున చెల్లించవలెను
2.	ప్రజారోగ్య పారిశుధ్యపు పనుల నిర్వహణ నిమిత్తం రోడ్లు ఊడ్చుటకు మరియు ట్రాక్టర్లపై పనిచేయుటకు స్వీపర్లుగా పనిచేయుట	ఆడవారు	20 మంది	ది. 01/04/2024 నుండి ది. 31/03/2025 వరకు	మనిషి 1కి టెండర్ ధరావత్తు రూ. 200/- చొప్పున చెల్లించవలెను
3.	కంపోస్టును రిక్షాలతో డంపింగ్ యార్డ్‌కు తరలించుటకు రిక్షా పుల్లర్లను సరఫరా చేయుట	మగవారు/ ఆడవారు	20 మంది	ది. 01/04/2024 నుండి ది. 31/03/2025 వరకు	టెండర్ ధరావత్తు రూ. 5000/-
4.	రక్షిత మంచినీటి సరఫరా పథకం నిర్వహణ మరియు పైపులైన్లు రిపేరు చేయుటకు సరఫరా చేయుట	మగవారు	12 మంది	ది. 01/04/2024 నుండి ది. 31/03/2025 వరకు	మనిషికి 1కి టెండర్ ధరావత్తు రూ. 200/- చొప్పున చెల్లించవలెను
5.	వీధి దీపములు రిపేర్లు చేసి వేయుటకు (ఎలక్ట్రీషియన్స్) సరఫరా చేయుట	మగవారు	4 ఇద్దరు	ది. 01/04/2024 నుండి ది. 31/03/2025 వరకు	మనిషికి 1కి టెండర్ ధరావత్తు రూ. 200/- చొప్పున చెల్లించవలెను
	మొత్తం		91		

గమనిక : (1) గ్రామపంచాయితీ నిధులు నిల్వను బట్టి పేమెంట్ చేయబడును. (2) గతములో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. (3) టెండరు షెడ్యూలు గ్రామపంచాయితీ కార్యాలయము నందు ఇవ్వబడును. (4) గ్రామపంచాయితీ వారి సూచనల మేరకు పనులు చేయవలయును. (5) టెండరుదారు పనులు చేసిన రోజులకు మాత్రమే వేతనము చెల్లించబడును.

సం/- శ్రీమతి దానం మేరీ నవరత్నకుమారి, సర్పంచ్, గ్రామపంచాయితీ, కైకలూరు

సం/- శ్రీ ఎ. వెంకటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ, కైకలూరు